



సన్నజాజి పందిరి క్రింద, మడత కుర్చీ వేసుకుని, చల్లగాలి ననుభవిస్తూ, పుష్ప సౌరభాన్ని ఆఘ్రాణిస్తూ, ఆహ్లాదకరంగా వున్న వాతావరణంలో దృష్టిని చేతిలో వున్న పత్రికపై నిమగ్నంచేసిన లలిత, వీధిగేటు చప్పుడు విని తలెత్తి చూసింది. మందహాసం ముఖారవిందంలో వెల్లివిరియగా, కుడిచేత్తో గేటు పట్టుకుని, ఎడం తిలో ఏదో ప్యాకెట్ పట్టుకుని, లోనికి వస్తున్న జయంతిని చూసి 'రా! రా! ఇప్పుడే నీ గురించి అనుకుంటున్నాను…నీకు నూరేళ్ళాయుష్షు!' అంది లలిత నవ్వి.

'ఎందుకు లేవమ్మా! అన్నేళ్ళు దీవిస్తావ్…పాతిక సంవత్సరాలకే విసుగు పుడుతుంటేను' అంది నాటక ఫక్కీలో జయంతి అక్కడున్న కుర్చీలో కూర్చుంటూ నవ్వి.

'ఏం ఇప్పుడు దిగారేం రాణీగారు… ఎప్పుడూ లేనిది' అంది లలిత సుతారంగా నవ్వి.

'ఏం లేదు లల్లీ! ఈవాళ మా తాతయ్యగారు' అని జయంతి నాలిక కరుచుకుని 'సారీ! మా ఆఫీసరుగారు ట్రాన్స్‌ఫరయి వెళ్ళిపోతున్నారు. ఆయనగారి స్థానే ఓ కుర్ర ఆఫీసరు వచ్చాడు. ఈయనగారికి ఫేర్‌వెల్ పార్టీ, ఆయనగారికి వెల్‌కం పార్టీ ఒక్కసారే చేశారు మా స్టాఫ్‌వాళ్ళు. ఆ హడావుడంతా పూర్తయ్యేసరికి యింత వేళయింది. ఇంటికి వెళుతూ, దారిలో వున్నదానివి కదా! నిన్నొకసారి చూచిపోదామని వచ్చాను' అంది జయంతి.

లలిత నవ్వి, 'ఇంతకూ నాకు శ్రమ తగ్గించావన్నమాట' అంది.

జయంతి ఆశ్చర్యపడినట్లుయి 'ఏం' అంది.

'ఆహా! ఏం లేదు…లక్షణంగా పార్టీలో సేవించి వచ్చావ్ గదా! ఇప్పుడు ప్రత్యేకంగా నీకోసం కాఫీ పెట్టక్కర్లేదుగా.'

'ఏం ఒద్దకమే నా తల్లీ! నీ లాంటిది మా ఆఫీసులో ఉండాల్సింది. నావంటి చాకిరీ చేయిద్దురు.'

'ఇపుడు మాత్రం తక్కువేం అయింది?'

'కాదు మరీ! ఎప్పుడో ఉదయం యిన్ని మెతుకులు తిన్ని బావగారు ఆఫీసు కెళ్ళిపోతారు. మళ్ళీ ఏ రాత్రికో తిరిగివస్తారు. హాయిగా ఈలోగా పనులన్నీ చక్కబెట్టుకుని ఏ పత్రికో, ఏ నవలో చదువుకోవడమో, లేక ఏ రేడియో సంగీతం వింటూనో కూర్చోవడమేగా నువ్వు చేసే ఉద్యోగం… ఖర్మ! నాకు అటువంటి రోజు వెల క్కొకసారైనా రాదు గదా! ఏం ఉద్యోగమో పాడు' అని నుదురు కొట్టుకుంది జయంతి.

లలిత పకపకా నవ్వింది జయంతి మాటలు విని.

'ఇంతకీ నేనేదో ఇంట్లో కూర్చుని సుఖపడి పోతున్నానని ఏడ్వడంగాని నీ సంగతి నువ్వు ఆలోచించవేం! హాయిగా ఆఫీసరిచ్చిన కాగితాలు దభదబా నాలుగు బాదులు బాదడమో లేకపోతే తోటి గుమస్తాల

సినీ చర్చా వేదికను తిలకించడం, అంతే గదా! వెల తిరిగేసరికి ఠంగున జీతం వచ్చి పడుతుంది...నేనూ ఉన్నాను ఎందుకూ...తిని కూర్చోడానికి తప్ప' అంది లలిత ఉస్సురని.

జయంతి నవ్వి 'నీకువమాత్రం ఏం తక్కువమ్మా! తల్లీ! సలక్షణంగా ఉద్యోగం చేస్తున్న భర్తా...అందమైన ఓ చిన్న యిల్లూ, దానికితగ్గ ఉద్యానవనం. ఇంకా కావాలంటే ఓ సంవత్సరం తిర్గి వచ్చే సరికి ఓ చిన్ని పా..'

తక్కున జయంతి నోరు మూసేసింది లలిత,

'ఏం! అంత ఉలుకెందుకు?'

'ఉలుకు కాదుగానీ! పోనీ అలాగే పుడితే నీ కిచ్చేస్తాలే' అని 'ఇంతకీ ఆ పేకెట్ ఏమిటి?' అంది అటువైపు దృష్టి మరల్చి.

'ఓ యిదా! మా ఓల్డ్ ఆఫీసరుగారు ట్రాన్స్ఫరయిన సందర్భంలో ఈ రోజు నేను సంతోషపూర్వకంగా 'సెల్ఫ్ ప్రజెంటేషన్' కొనుక్కున్నాను. చూడాద్దూగాని ఉండు' పేకెట్ విప్పింది జయంతి.

లలితకళ్లు జిగేల్ మన్నాయి...జయంతి పాకెట్‌విప్పి చీరతీసి లలిత వేపుకిచ్చింది నవ్వుతూ....

అసూయో, అనురాగమో గాని లలిత అధరాలపై కొన్నిక్షణాలు మందహాసం కనిపించి మాయమయింది.

లలిత చీరవంక చూసింది.. శ్వేత గులాబీ రంగుచీర...చుట్టూ హంసలబారు లున్నాయి. గుప్పిటలోనికి యిమిడే చీర అది. ఇటూ అటూ తిరగేస్తూ ఒకసారి లలిత తను కట్టుకున్న చీరవంకా, జయంతి కట్టుకున్న చీరవంక చూసింది...జయంతి ఎప్పుడూ మంచి విలువైన చీరలే కడుతుంది. ఆవును మరి ఉద్యోగస్థురాలు! తనో! ఎప్పుడూ కనీసం సంక్రాంతి పండుగకైనా తనకు భర్త మంచిచీర తేలేదు...ఈ ఆలోచన రాగానే లలితకు భర్తమీద కోపం వచ్చింది.

'ఎలావుంది లల్లీ చీర' అన్న జయంతి ప్రశ్నకు,

'బాగానే వుంది' అని నీరసంగా జవాబిచ్చింది. .

ఇంతలో లలిత భర్త రాజారావు రావడంతో సంభాషణ ఆగిపోయింది...ఇద్దరూ లేచి నిలబడ్డారు...రావు లోపలికి వెళ్లడంతో లలిత జయంతివంక చూసి నవ్వి 'వన్‌మినిట్ జయా! ఇప్పుడే వస్తాను' అంటూ భర్త ననుసరించింది.

'ఏమంటూంది మీ జయంతి' అన్న భర్త మాటకు 'నేనింత దురదృష్టవంతురాలి నయినందుకు ఏడవమంటూంది' అని స్వగతంలో అనుకొని, పైకి 'ఏం లేదు... మామూలు సొగతులే! వాళ్ల ఆఫీసరు ట్రాన్స్ఫరు అయినారట....అదీ విశేషం' అంది...

'ఆహా! ఇంక సుఖపడిందన్నమాట మీ స్నేహితురాలు' అని నవ్వి 'పాదు పాపం! ఒక్కర్తే కూర్చున్నట్టుంది' అన్న భర్త మాటలు విని లలిత ఇవతలికి వచ్చేసరికి 'ఇంక నే వెళ్లొస్తాను లలీ' అంటూ లేచి నిలబడింది జయంతి.

'ఫరవాలేదు! కూర్చో' అన్న లలిత మాటలకు 'లేదు! ఇంటిదగ్గర కంగారు పడతారు. మళ్ళీ రేపు కలుస్తానుగా' అని జయంతి వడి వడిగా నడిచి వెళ్ళిపోతుంటే లలిత తెల్లబోయింది.

లలిత లోపలికి వచ్చేసరికి రాజారావు మల్లెమొగ్గల పొట్లం విప్పి టేబుల్ మీద పోస్తున్నాడు. లలితను చూసి నవ్వి 'ఏం లలితా! స్నానం చెయ్యమంటావా?' అన్నాడు.

'చెయ్యండి దానికికూడా నన్ను అడగాలా ఏం' అంది మనసులో కదులుతూన్న భావానికి రంగులు దిద్దుకుంటూ...ఆమె వైపు రావు వింతగా చూశాడు. ఆమె దృష్టి ఎటో వుంది...టవల్ తీసికొని బాత్ రూం వైపు నడిచాడు.

ఈలోగా లలిత వంటింట్లోకి వెళ్ళి, పీటలు వాల్చి, కంచాలుపెట్టి అన్నీ వడ్డించింది. ఇద్దరూ భోజనానికి కూర్చున్నారు. భోజనంచేస్తూ రావు లలిత ముఖంలోకి పరిశీలనగా చూశాడు. లలిత తల దించుకుంది. భర్త అడిగిన ప్రతి విషయానికి ముక్తసరిగానే జవాబిచ్చింది. లలిత వైఖరి రావుకు ఎంతమాత్రం అర్థం కాలేదు. లలితలో కలిగిన హఠాత్పరిణామానికి ఆశ్చర్యపోతూ, అర్థంగాని స్థితిలో త్వరగా భోజనంకానిచ్చి పడకగదిలోనికి వెళ్లిపోయాడు రావు.

లలిత కంచాలు కడిగి, వంటిల్లు శుభ్రం చేసి వచ్చి, చడీ చప్పుడూ లేకుండా హాల్లోకివచ్చి ఏదో పుస్తకం చదువుతూ కూర్చుంది. రావుకొంతసేపు చూసి 'లలితా' అని పిలిచాడు.

జవాబు రాలేదు.

'పది అయింది లలితా! ఇంక పడుకో కూడదూ' అన్న భర్త మాటలకు—

'మీకు నిద్ర వస్తే మీరు నిద్రపొండి' అంది గంభీరంగా.

'అలాగే నిద్రపోతాను గాని ఏమొచ్చింది యీ వేళ రాణిగారికి' అన్నాడు హేళన చేసే ప్రయత్నంలో.

'నాకేం రాలేదుగాని మీరు నిద్రపొండి! నన్నాట్టే విసిగించక' అంది చేతిలోని పుస్తకంలో మరింత తల దూర్చి.

'అలాగేం' అంటూ ఆమె చేతిలోని పుస్తకం లాగివేసి, తక్కున దీపం ఆర్పేసి మంచం దగ్గరకు ఆమెను తీసికెళ్ళిపోయాడు రావు. నిస్సహాయంగా అతని చేతులలో వాలిపోయింది.

* * *

లలితతో చెప్పి ఇంటికి వచ్చిన తర్వాత జయంతికి చాలా బద్ధకంగా ఉన్నట్లు తోచింది. ఉదయంనుండీ పార్టీల హడావుడితో నానా హైరానా పడిపోయింది. ప్రాణం డీలాగా ఉందేమో వంటింట్లోకి వెళ్ళి స్టౌమీద కాగుతూన్న వేడినీళ్ళు తీసుకుని పెరట్లోకి వెళ్లి ముఖం కడుగుకుని టవల్‌తో తుడుచుకుంది. ఇంట్లో తన గదిలోకి వచ్చి లైటువేసి అద్దం ముందు కూర్చుని వాల్జడను ముందుకు వేసుకుని కొంచెంసేపు అల్లి రిబ్బనుతో గట్టిగా బిగించింది. కాస్త పౌడరు అరచేతిలో వేసుకుని, ముఖానికి రుద్దుకుంది. కాస్త రిలీఫ్ వచ్చినట్లయింది. చెంపలు అరచేతోత్తడుముకుంటూ అద్దంలో తన ముఖం చూసుకుని నవ్వుకుంది.

అంతలో తల్లివచ్చి 'జయంతీ! కాఫీ తాగుతావా? భోజనం చేస్తావా?' అని అడిగింది...

'ఆకలిగా లేదమ్మా! కాస్త కాఫీచాలు' అంది.. 'అలాగే' అని ఆవిడ వెళ్ళిపోయింది. జయంతికింకా బద్ధకం పోలేదు.. ఒళ్ళు విరుచుకుంటూ లేచి మంచందగ్గర కొచ్చింది...రాత్రి సగం చదువుతూ వదిలేసిన వీక్లీని తీసికొని పేజీలు త్రిప్పుతూ చదువుకోవారంభించింది ... చదువుతూన్న

# రాజీనామా

థ మంచి సస్పెన్సుతో సాగిపోతున్నది ... ఆ కథలో నాయకురాలు చదువుకున్న ఓ ఆధునిక యువతి...సాఫీగా సాగిపోతున్న సంసారం వాళ్ళది...ఒకళ్ల అభిరుచులు మరొకళ్ళు గుర్తించి ఏ అరమరికా లేకుండా హాయిగా జీవిస్తున్నారు..ఉన్నట్టుండి ఆమెగారికి ఉద్యోగం చెయ్యాలని బుద్ధిపుట్టి భర్తను బ్రతిమాలి, ఆఖరికి వేధించి ఉద్యోగం సంపాదించుకుంటుంది...కాని కొన్నాళ్ళకు ఆమె కన్న కలలన్నీ కరిగి పోయాయి. అనుకోనివిధంగా ఎన్నో అవాంతరాలు ఆ సుఖప్రదమైన దాంపత్య జీవనానికి అవాంతరాలు కలిగించాయి...ఒక్కోసారి ఉద్యోగాన్నుండి తిరిగివచ్చేసరికి రాత్రికూడా అయి, భర్త చెయ్యి కాల్చుకోవాల్సిన దుస్థితిని కూడా స్వయంగా చూసింది. మనసు మూగవోయి, కళ్లంతా నీళ్లు నిండిపోయి ఆ క్షణాన ఉన్నపాటుగా ఉద్యోగానికి రాజీనామా యిచ్చేసింది ...

జయంతి ఆ కథ చదివి నవ్వుకుంది... కథానాయకురాలి కథనాన్ని తన విధానంతో పరిపోల్చి చూసుకుంది...ఇల్లాలు, భర్త, పిల్లలూ ఉన్నవాళ్లకు ఉద్యోగాలు చెయ్యడం ఎలా సాధ్యమవుతుంది? ఎంత కాదనుకున్నా ఈ బంధాలన్నీ ఏదోరూపంలో వేధిస్తూనే ఉంటాయి. అందుకే తను నిశ్చయించుకుంది — అసలు వివాహం చేసుకోకుండా ఉండిపోవాలని..అందువల్ల బాధ్యతలూ వుండవు ...వేదనా వుండదు.. చప్పున లలిత గుర్తుకు వచ్చింది. ఆమె తన స్నేహితురాలు, తనతో చదువుకున్నదే. వాళ్ళవాళ్ళు కాస్త వెనక వున్న వాళ్ళేమో! ఉద్యోగ ప్రయత్నానికి స్వస్తి వాచకంపలికి గృహస్థాశ్రమంలో ప్రవేశించింది. హాయిగా పువ్వుల్లో పెట్టి పూజించే భర్తా, అందమైన చిన్న యిల్లూ, అందుకు తగిన చిన్నతోటా, నిశ్చింతగా కాలం వెళ్ళబుచ్చ గలుగుతున్నది. మరి తనో. యాంత్రిక జీవనం అయిపోయింది. గబగబా కాసిన్ని మెతుకులు కతికి, ఇంతటిఫిను చేతబట్టుకుని, వెళ్ళి అరగంటసేపు సిటీబస్ కోసం నిలబడి మళ్ళీ ఉసూరుమంటూ సాయంత్రానికి కొంపకు చేరుకుంటుంటే ఇంక ఆలోచనలకు తీరికేదీ? ఎప్పుడయినా కాస్త రిలీఫ్ అంటూఉంటే అదివారమే!

మర్నాడు ఆదివారం అన్న విషయం జయంతికి చప్పున జ్ఞాపకానికి వచ్చి, 'హమ్మయ్య' అని ఊపిరి పీల్చుకుంది. అలా ఆలోచనలతోనే నిద్రపోయింది.

* * *

మర్నాడుకూడా లలిత 'మనస్సు మనస్సులో లేదు. యాంత్రికంగా లేచి పనులు చక్కబెట్టింది. రావు ఆఫీసుకి వెళ్ళిపోయాక ఇల్లు సర్దుకుని తీరిగ్గా ఆలోచించడం మొదలు పెట్టింది.

'అవును జయంతిచెప్పినట్లు తనకేం తక్కువ. కాని...కాని... అదేమిటో ఆచీర చూసినప్పటినుంచీ తన మనస్సు మనస్సులో లేదు. తనజీవితంలో అటువంటిచీర కట్టగలదా? తనకు అన్నీ వున్నాయి. అందమైన యిల్లూ, తనను అమితంగా ప్రేమించే భర్తా. కాని అటువంటి చీర తనభర్త ఎప్పటికైనా కొనగలడా? తాహతుకి మించిన ఆశ. భర్త ఒక ఆఫీసులో యు. డి. సి. గా పనిచేస్తున్నారు. వచ్చేజీతంతో గుట్టుగా సంసారాన్ని నెట్టుకువస్తున్నాడు. ఎంత పొదుపరితనంగావున్నా జీతం ఇద్దరికీగూడా సరిపోవడమేలేదు. కనీసావసరాలు చూసుకున్నా కనీసం నెలకి రెండొందలు తక్కువేనాడగా కాలేదు. ఉన్నా పుట్టింటికి వెళ్ళి తెచ్చుకోవడానికి అడ్డువచ్చే అభిమానానికి కొదువలేదు. ఎంత ఆలోచించినా ఈకష్టాలు గట్టెక్కేటట్లు తన సరదాలు తీరేటట్లు కన్పడ్డంలేదు. లలితకు ఆక్షణంలో ఓ ఆలోచన స్ఫురించింది. అవును? తనుకూడా ఉద్యోగం చెయ్యగల అర్హతవరకూ చదువుకున్నదే. అందువల్ల గట్టిగా ప్రయత్నించేసి ఉద్యోగం సంపాదించగలిగితే హాయిగా జయంతిలా బోలెడన్ని చీరలు కొనుక్కోవచ్చు. ఈ చాలీ చాలని సంపాదనమీద ఆధారపడి ఎన్నాళ్ళిలా బ్రతకాలి?

ఈ ఆలోచనరాగానే లలితకి ఏనుగంత బలం వచ్చింది. సాయంత్రం భర్త రాగానే ఎలా అతనికీవిషయం బోధపరిచి ఒప్పించాలో ఎలా చెపితే బాగుంటుందో ప్లాను వేసుకుంది. దాసీదివస్తే అంట్లుతోమించేసి ఇల్లంతా అద్దంలా సర్దింది. మంచంమీది దుప్పటి, దిండుగలీబులు తీసివేసి ఇస్త్రీ మడతలు వేసింది. రాత్రి భర్త తెచ్చిన మల్లెపూలపొట్లం తీసి పారేసి, దాసీదాని చేత మళ్ళీ తెప్పించింది. సాయంత్రం అయిదుగంటలయేసరికల్లా రావుకిష్టమైన గోంగూరపచ్చడి, సాంబారు, వంకాయ మెంతికారం వండింది. తనివితీరా స్నానంచేసి తనకున్న చీరల్లో భర్తకు ఎక్కువ యిష్టమైన లేతనీలం ఖటావ్ వాయిల్‌చీర, జాకెట్ వేసుకుని మల్లెపూలు పెట్టుకొని అతని రాకకై ఎదురు చూడసాగింది.

రావు ఇంటికొచ్చేసరికి ఆరున్నరఅయింది. ఆరున్నర అయింది. నవ్వుముఖంతో ఎదురుగా వచ్చింది లలిత. రావు అలిసిపోయినట్లున్నాడేమో మాట్లాడకుండా లోనికి

నాకు తెలీకుండా వాచీ ఎందుకొన్నావురా?
— ఇప్పుడే ఓ సంబంధం చూశాను నీకు!



రు. 20 కి గడియారములు పొందండి

మేము కొత్తగా కనిపెట్టబడిన స్కీముద్వారా రు. 147/—విలువగల మా రోమర్ పాపులర్ వాచీని రు.20 లకే పొందండి. నేడే మీ ఆర్డరు పంపండి.

Romer Agencies, (APTW 15)
Box 1441, DELHI-6.

రెండు రత్నాలు
Licenced under M. & T. P.
Act — Rule (83)
వీర్యస్తంభనము–Tonic Pills&Oil
కడుపులోకి పైకి మర్దనకు (1) కోర్సు 20 రోజులు రూ. 52లు-స్పెషల్ రకం రూ. 47 పైకం M.O. పంపాలి—వి. పి. లేదు.
డా. రత్నం సన్స్, (Estd 1904)
మలకపేట బిల్డింగ్స్, New
అజంపూరా మార్కెట్ వద్ద,
హైదరాబాద్—36 ఆం. ప్ర.

పుస్తకములు

5 పుస్తకముల పెట్టె రు. 5–50.
(1) కొక్కోకశాస్త్రం (2) సుహాగ్ రాత్ (3) చుంబన పద్ధతులు, (4) 84 ఆసనములు, (5) రహస్యఫోటో ఆల్బం. ఒక్కొక్క పుస్తకం రు. 2/–. పోస్టేజి, ప్యాకింగ్ అదనం. ఇంగ్లీషులో వ్రాయండి.
SULEKHA TRADERS.
WAT-7) .Beat No. 13, Aligarh

దగ్గు నివారిణి: తిరగబెట్టకుండా దగ్గును యిప్పుడే నిర్మూలించండి. ఖరీదు రు. 157-15 ట్రయల్ రు 12-13 పై.
చెవుడు: పూర్తికోర్సుద్వారా చెవుడు పూర్తిగా నయమగును. పూర్తి కోర్సు రు. 147-15. ట్రయల్ రు. 17-97 పై.
కంటిలోని పొర. పక్కమైనా, కాకపోయినా. ఆపరేషన్ లేకుండా రు. 87-97 పైసలకు శాశ్వత నయం చేయబడును.
జాబులు ఇంగ్లీషులో వ్రాయండి.
DR. SHERMAN, F.C.S.
181. .N Guha Road, Calcutta-28

# రాజీనామా

వెళ్ళి ఈజీచైరులో కూలబడి ఉన్న రవ్వాడు.

'ఏం అలా ఉన్నారే' అంది లలిత దగ్గరగావచ్చి.

రావు జవాబివ్వలేదు.

'తలనొప్పిగావుందా' అని అడిగింది.

రావు కొద్దిగా తలపైకెత్తి లలితవంక చూశాడు. లలిత ముత్తారంగానవ్వి వాల్జడను ముందుకుతీసుకుని అల్లడం పూర్తిచేసి 'చెప్పరేం' అంది.

చెప్ప వాల్సకుండా లలితను చూస్తున్న రావు తొట్రుపడి 'అబ్బే! ఏంలేదు' అన్నాడు.

లలిత లోనికివెళ్ళి ఫ్లాస్కు తీసుకొచ్చి కాఫీపోసి యిచ్చింది.

'కాఫీ అమృతంలావుంది ఇవాళ'అన్నాడు కాఫీకప్పు లలితచేతికిస్తూ.

'నిజంగా' అంది...

'నిజం లలితా!' అన్నాడు రావు.

'లెండి స్నానం చేద్దురుగాని ... అలసట తగ్గుతుంది' అని బాత్‌రూం వైపు స్నానానికి అంతా రెడీ చేసిపెట్టింది.

రావు స్నానంచేసి వచ్చేసరికి భోజనాలు వడ్డించింది. ఇద్దరూ భోజనాలకు కూర్చున్నారు. భోజనాలు పూర్తయ్యే వరకు లలిత ఆ కబుర్లూ ఈ కబుర్లూ చెప్పి నవ్వుతూ ఆతన్ని తెగనవ్వించింది. ఆమె హుషారంతా చూసి రావు అర్థంకాని వాడిలా 'అందుకే ఆడవాళ్ళతో ఏ మెచ్చినా పట్టలేం అన్నారు' అని 'ఏమిటి లలితా ఇవాళింత బ్రహ్మాండంగా పాకం రుచి చూపించావ్' అన్నాడు. లలిత మూతి ముడుచుకొంది. 'ఏం! నేనెప్పుడు మాత్రం బాగా చెయ్యలేదు?' అంది.

రావు నవ్వి 'అదికాదు లలితా! ఇవాళ ఏదో ప్రత్యేకత వుంది. ఈ వంట రుచి చూసిన వాళ్ళెవరయినా సరే నువ్వేది అడిగితే అది యిచ్చేస్తారు' అన్నాడు.

'మీరయినా అంతేనా?' అంది.

'ఓ' అన్నాడు.

'సరే అడుగుతాను...ముందు భోజనం కానివ్వండి.' అంది.

భోజనాలు పూర్తయింతర్వాత చేతిలో తమలపాకులు, వక్కలూ ఉన్న పళ్ళెం పట్టుకొని పడక గది ప్రవేశించింది.

తమలపాకులు చుట్టియిస్తూ 'అడగనా' అంది

'అడుగు' అన్నాడు రావు.

లలిత కోరిక విని రావు తెల్లబోయాడు. 'ఇదేమిటే లలితా! నువ్వు ఉద్యోగం చేస్తావా?' అన్నాడు.

'ఏం చెయ్యగూడదా? జయంతి చెయ్యడం లేదూ' అంది.

'జయంతికీ, నీకూ పోలికేమిటి లలితా? ఆ అమ్మాయి మీద ఆధారపడిన వాళ్ళు వెనకాల వున్నారు' అన్నాడు.

'ఆధారపడిన వాళ్ళు ఉంటేనే ఉద్యోగం చెయ్యాలేమిటి? మీరు ఆఫీసుకు వెళ్ళిపోతే నాకేం తోచడంలేదు. గోళ్ళు గిల్లుకుంటూ ఇంట్లో కూర్చోవడం కంటే నయంకదూ' అంది.

ఎంత చెప్పినా లలిత పట్టువదలని రావు మార్చలేక పోయాడు. పైగా అలిగి కూర్చుంది. ఏడుపు ముఖం పెట్టింది. ఆఖరికి ఏడ్చేసిందికూడా... రావు తెల్లబోయాడు. లలితని అనునయించేసరికి తల ప్రాణం తోకకి వచ్చింది. లలిత పట్టుదలే నెగ్గింది. తన పలుకుబడి ఉపయోగించి ఉద్యోగం వేయిస్తానని హామీ యివ్వడంతో లలిత ముఖం నవవికసిత కుసుమంలా అయింది.

ఆ రోజు నిజంగా లలిత జీవిత చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించుకోదగిన రోజు. రావు ఎలాగో కష్టపడి తనకు తెలిసిన స్నేహితుల ద్వారా ప్రయత్నించి లలితకు టెంపరరీగా ఉద్యోగం వేయించగలిగాడు. లలిత సంతోషానికి అవధులు లేవు. మనస్సంతా ఆనందంతో నిండిపోయింది.

తనే స్వయంగా జయంతి ఇంటికి వెళ్ళింది. లలితను ఆప్యాయంగా ఆహ్వానించింది జయంతి. లలిత చెప్పిన విషయం విని ఆశ్చర్యపడి 'కంగ్రాచ్యులేషన్స్' అంది.

చాలా సేపు ఆడవాళ్ళు ఉద్యోగాలు చేయడాన్ని గురించీ, సాధక బాధకాలు చర్చించుకొన్న తర్వాత 'డ్యూటీలో ఎప్పుడు జాయిన్ అవుతావ్ లలీ' అంది జయంతి.

'రేపే జాయిన్ అవాలనుకుంటున్నాను జయంతీ!' అని 'ఏమిటో భయంగా వుంది

హాకు' అంది.

జయంతి నవ్వుతూ 'ఎందుకు భయం. భయం ఉంటే అసలు మనం అక్కడ పని చేయలేం' అంది.

'అదే జయంతీ! మీ బావగారితో పోట్లాడి ఉద్యోగం వేయించుకున్నానే గాని ఎమిటో భయంగానే వుంది' అంది.

'క్రొత్త కదూ! కొన్నాళ్లవరకూ అంతే మరి' అంది జయంతి. ఈలోగా జయంతి తల్లి అక్కడికి వచ్చింది.

'అమ్మా! లలితకు ఉద్యోగం వచ్చింది' అని విషయం చెప్పగానే ఆవిడ ఎంతగానో సంతోషించి 'చూడమ్మా! లలితా! పెళ్ళియినవాళ్ళు ఉద్యోగాలు చెయ్యగూడదని మా జయంతి వాదిస్తూ వుంటుంది. నిన్ను చూసైనా బుద్ధి మార్చుకుంటుందేమో చెప్పు తల్లీ' అనగానే అందరికీ నవ్వొచ్చింది. జయంతి తల్లి లోనికి వెళ్ళింది.

'ఏం జయంతీ! ఇంక పెళ్ళిచేసుకోవా ఏం?' అంది లలిత.

జయంతి యిబ్బందిగా ముఖంపెట్టి 'ఊహు' అంది.

'కన్యగా ఉండిపోతావా ఏం' అని లలిత నవ్వి, 'అసలు ఏదో ఉంది మనస్సులో' అంది.

జయంతి కళ్ళు పెద్దవిచేసి లలిత వంక చూసింది. లలిత పకపకా నవ్వింది. జయంతి ప్రసక్తిని మార్చి 'చూడు తల్లీ మా ఆఫీసు కూడా మీకు దగ్గర్లోనే వుంది కనుక రోజూ యిద్దరం కలిసే వెళుతుందాం, నేను వచ్చేవరకూ ఉంటూండు' అంటే లలిత 'సరే' నంది.

మర్నాడు ఉదయం లలిత పెందరాళే లేచింది. ఇల్లంతా శుభ్రం చేసింది ఉదయం పెందరాళే రమ్మని పని మనిషితో మరీమరీ చెప్పింది. ఏడుగంటలయినా పనిమనిషి జాడకనిపించలేదు. చిరాకనిపించింది. అంట్లన్నీ తనే వేసుక్కూర్చుని గబ గబా తోమేసింది. స్నానానికి వేన్నీళ్లు పెట్టింది. కాఫీలు పూర్తయ్యేసరికి ఎనిమిది అయింది.

'లలితా! త్వరగా రెడీ కావాలి!' అన్నాడు రావు కాఫీ త్రాగుతూ.

'అలాగే' అని లలిత వంట కుపక్రమించింది. వంటలవీ పూర్తయి ఇద్దరూ భోజనాలు పూర్తిచేసేసరికి తొమ్మిదిన్నర అయింది.

'ఉండండి! ఒక్క నిమిషం' అని గది లోనికి వెళ్లి డ్రెస్ మార్చుకుని టాయిలెట్ అయింది.

పావుగంట గడిచిన తర్వాత బయటకు వచ్చి 'పదండి' అంది

ఇంటికి తాళంవేసి ఇద్దరూ బయలు దేరారు.

'సిటీ బస్ వచ్చేసరికి ఆలశ్యం అవుతుంది. రిక్షాలో వెళదాం.' అన్నాడు రాజారావు. 'సరే' నంది లలిత.

ఆఫీసు ప్రాంతం దగ్గర కొచ్చేకొద్దీ లలిత గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. ముఖం మీద ఆవరించిన స్వేద బిందువులను కర్చీఫ్‌తో తుడుచుకుంది. రిక్షా ఆగింతర్వాత యిద్దరూ దిగారు. అప్పుడే పది గంటలు దాటిందేమో! అంతా ఒక్కొక్కరే వస్తున్నారు. లలితా, రాజారావూ యిద్దరూ వెళ్లి వెయిటింగ్ రూంలో కూర్చున్నారు. అరగంట గడిచిం తర్వాత ఆఫీసరుగారు వచ్చారు. ఆయన ఇదివరకే రాజారావు స్నేహితుల ద్వారా పరిచితుడు కావడంవలన ఎంతో ఆప్యాయంగా యిద్దరినీ ఆహ్వానించాడు. లాంఛనాలన్నీ పూర్తయ్యాక లలితకు బాధ్యత వప్పగించారు. రాజారావు వెళ్లిపోతుంటే లలిత భయంగా నవ్వింది.

'మీరేనా క్రొత్తగా వచ్చింది' అన్న కంఠస్వరం విని లలిత తల పైకెత్తి చూసింది.

'నా పేరు స్వరాజ్యం! ఇక్కడ టైపిస్టుగా పని చేస్తున్నాను' అంది.

'కూర్చోండి' అంది లలిత. స్వరాజ్యం కూర్చుంది. ఒంటి నంటిపెట్టుకొని పోయినట్లున్న ఇంగ్లీష్ కలర్ నైలాన్ చీరా, ఒదేరకం జాకెట్ వేసుకొని ఉంది స్వరాజ్యం. మెడలో ఒంటిపేట గొలుసు. ఆమె నవ్వినప్పుడల్లా కదులుతూ తళుకు మంటున్నది. చెవులకు సాదా రింగులున్నాయి. తీరికగా టాయిలెట్ అయి వచ్చినట్లు కనిపిస్తున్న ఆమె సోయగాన్ని తిలకించడంలోనే లలిత కొంత సమయం వృధా చేసింది.

'ఈ ఉద్యోగం యింకొకరికి రావలసింది. మీకు వచ్చింది' అంది స్వరాజ్యం.

'ఎవరికి' అంది లలిత.

'పాపం! ఆయనెవరో నెల రోజులనుంచి తిరుగుతున్నారు. అంతా రెడీ అయింది. ఇవాళో రేపో ఆర్డర్సు వస్తాయనుకుంటున్నారు—

'పాపం! అంతా తారుమారు అయింది' అంది.

పాపం! పాపం! అన్న స్వరాజ్యం మాటలు విని లలిత మనస్సు చివుక్కుమంది ఆ పాపానికి తను ఒడిగట్టుకున్నానా? అనిపించింది. ఎవరికీ రావలసిన ఉద్యోగం. ఉద్యోగం. ఎవరో నిర్భాగ్యుడు. బ్రతుకంతా ఉద్యోగంమీదే ఆధారపడి ఉందో ఏమో!

'ఏమిటేమిటో ఆలోచిస్తున్నారు!' అంది స్వరాజ్యం.

లలిత తొట్రుపడి, 'అబ్బే! ఏం లేదు!' అంది

'మీకేమయినా అవసరంవస్తే నన్ను అడగండి. చెబుతుంటాను' అంది.

'థేంక్స్' అంది లలిత. స్వరాజ్యం లేచి తన సీటులోనికి వెళ్లిపోయింది

ఒక అరగంట గడిచింతర్వాత ప్యూను వచ్చి 'అయ్యగారు మిమ్మల్ని పిలుస్తున్నారు' అని చెప్పాడు. లలిత కాగితాలు. ఒకప్రక్కన పెట్టి, దానిమీద పేపరు వెయిట్ ఉంచి ప్యూనువెనకాలే వెళ్ళింది. స్ప్రింగుడోర్ తెరుచుకొని లోపలికి వెళ్లింది. ఆఫీసరు గారు పేపరు కాబోలు తదేకంగా చూస్తున్నవాడల్లా ఆగి లలితను చూసి 'రండి! కూర్చోండి!' అన్నాడు.

లలిత కూర్చోవడానికి సందేహించడం చూసి, 'ఫర్వాలేదు! కూర్చోండి' అన్నాడు ఆయన, లలిత బెరుకు బెరుకుగా కూర్చుంది.

'చూడండి! మీకు ఉద్యోగం క్రొత్త. బాధ్యత క్రొత్తది' అంటూ నవ్వి 'ఎవరి బాధ్యతలు వాళ్లు సక్రమంగా నెరవేర్చుకుంటూ పోతే ఎవరికీ వచ్చిన ఇబ్బంది లేదు... అంతే నంటారా' అన్నాడాయన.

'అంతే కదండీ' అంది లలిత నవ్వు తెచ్చుకొని.

చాలాసేపు ఆయన ధోరణి ఉపన్యాసంలా కొనసాగింది. లలిత ఓపికగా కూర్చుంది. అంతలో ఆయన కాలింగ్ బెల్ ప్రయోగించగానే డోర్‌తెరచుకొని ప్యూను లోపలికి వచ్చాడు. 'వెళ్లి రెండు కూల్‌డ్రింక్స్ తీసుకురా' అన్న ఆఫీసరుగారి ఆజ్ఞ వినగానే

ప్యూను బయటకు వెళ్ళిపోయాడు.

'ఎందుకులెండి' అందామనుకున్న మాటలు లలిత గొంతులోనే ఆగిపోయాయి. తీరా తెచ్చిన తర్వాత తిరస్కరించడం సభ్యత కాదనుకుని లలిత తీసుకుంది. సాయంత్రం అయిదుగంట లవుతుండగా ప్యూను మళ్ళీ వచ్చాడు.

'అయ్యగారు మిమ్మల్ని వెళ్ళిపోవచ్చని చెప్పమన్నారండి' అన్నాడు.

'అలాగే' అని లలిత కాగితాలన్నీ సర్ది పెట్టి స్వరాజ్యం దగ్గరకు నవ్వుతూ వచ్చింది.

'రండి' అని కుర్చీ చూపించింది స్వరాజ్యం.

'మీరింకా రారనుకుంటాను' అంది లలిత యింకా స్వరాజ్యం ఏవో కాగితాలు టైపు చేస్తూండడం చూసి.

స్వరాజ్యం నవ్వింది. టాయిలెట్ అయి వచ్చిన ఆమెముఖం చెమటవల్ల తడిసిపోయి మాటిమాటికి కర్చీఫ్‌తో తుడుచు కుంటూన్నది.

'ఇంకా ఆఫీసరుగారి పర్మిషన్ రాలేదు' అంది.

'ప్రతిరోజూ పర్మిషన్ రావాలా'

'రావాలండే! మీకివాళ క్రొత్త గనుక పర్మిషన్ అయిదుగంటలకే వచ్చింది. వేరే పర్మిషన్ రానక్కరలేదు. కావలసినంత పని మనకోసం కాచుకుని కూచుంటుంది. అంతా లజ్జాంటే' అని నవ్వి 'వెళ్ళండి! మీరు పాపం!' అంది.

స్వరాజ్యం సానుభూతినిగురించి లలిత పట్టించుకోలేదుగాని ఆమెచెప్పిన విషయాలు పునశ్చరణ చేసుకోసాగింది. స్వరాజ్యంతో చెప్పి ఇంటికి బయలుదేరింది.

బస్‌స్టాప్‌కొచ్చేసరికి అయిదున్నరయింది. తనువెళ్ళేబస్ వచ్చేసరికి ఆరయింది. ఇంటి కొచ్చేసరికి ఆరుంబావు అయింది. తలుపులు తెరిచి ఉంటే భర్త తనకంటే ముందువచ్చి ఉండాలని ఊహించి గబగబా లోనికి వచ్చింది. లలిత వచ్చేసరికి రాజారావు స్టౌమీదనున్న కాఫీగిన్నె దింపబోతున్న వాడల్లా చేతులు చుర్రుమని కాలి దభీమని గిన్నె వదిలేశాడు. కాఫీ అంతా చెల్లా చెదురయి పోయింది.

'అయయ్యో!' అంటూ లలిత గభాలున

# రాజీనామా

రావుదగ్గర కొచ్చి మండుతూన్నందువలన ఊదుకుంటూన్న భర్తచేతుల్ని పట్టుకుని చూసింది. బాగా కాలిందేమో వ్రేళ్ళు బాగా ఎర్రబడ్డాయి. లలిత కళ్ళు క్షణంలో అశ్రుపూరితాలయాయి. క్షణంలో జరిగిన సంఘటనకు రాజారావు విచలితుడై అలా గుడ్లప్పగించి లలితవంకచూస్తూ వుండి పోయాడు.

'ఉండండి! మీరు!' అని ఒలికిపోయిన కాఫీ అంతా తుడిచిపెట్టి మళ్ళీ గిన్నెతోమి తీసుకొచ్చి కాఫీపెట్టింది. లలిత కాఫీ కాచి తీసుకొచ్చేవరకూ రాజారావు ఒక్కమాట కూడా మాట్లాడలేదు.

'ఇంతలో అంతిదియిపోతే ఎలా! అయినా మిమ్మల్నెవరు కాఫీ కాచమన్నారు' అంది లలిత కాఫీ ఇస్తూ...

'ఏం నాకామాత్రం కాఫీకాచడం కూడా రాదని కాబోలు నీఉద్దేశ్యం' అన్నాడు రావు ...

'రాదనికాదు! అలవాటులేనిపని ... వెధవ బస్సు ఆలస్యం అయిపోయింది. లేకపోతే పెందరాళే వచ్చేదాన్నే' అంది. కాసేపటికి రాజారావు లలిత హాసపరిహాసాలతో జరిగిన బాధ మరిచిపోయాడు. లలిత ఉదయం ఆఫీసుకి వెళ్ళింది మొదలు, ఆఫీసరు పిలిచి చెప్పిన ఉపోద్ఘాతంతోసహా తు. చ. తప్పకుండా చెప్పేసింది.

'అయితే మీ ఆఫీసరు మంచివాడేనన్న మాట' అన్నాడు రాజారావు నవ్వుతూ.

'ఏమో! ఎవరు చెప్పగలరు. క్రొత్త గదా!' అంది లలిత నవ్వి

* * *

మర్నాడు ఉదయం జయంతి వచ్చింది... అప్పటికి తొమ్మిదిన్నర అయింది...రాజారావు ఏదో పనుందని, లలితను వెళ్ళమనీ చెప్పి పెందరాళే భోజనంచేసి, ఆఫీసుకి వెళ్ళి పోయాడు.

'ఏం లల్లీ! ఇంకా తెమల్లేదూ! పిటీ బస్‌కోసం అరగంటయినా వెయిట్ చెయ్యాల్సి వస్తుంది కద' అంది జయంతి.. అక్కడున్నంతసేపూ ఇద్దరూ ఎన్నోవిషయాలు మాట్లాడుకున్నారు.

'పద' అంది లలిత డ్రెస్ సరిచేసుకుని ఇంటికి తాళం బిగించి. బస్‌స్టాప్‌వరకూ ఇద్దరూ నడుచుకుంటూ వచ్చారు...అక్కడ వాళ్ళతోబాటు తామూ బస్‌కోసం తపస్సు చేస్తూంటే 'హలో జయంతీ!' అన్న పిలుపు విని ఇద్దరూ ఒక్కసారే అటు తిరిగి చూశారు. ఎవరో యువకుడు అల్లంత దూరంలో సైకిలు ఓ చేత్తో పట్టుకుని వాళ్ళవైపే చూస్తున్నాడు. సైకిల్ కేరియర్‌ను ఫైలులాంటి దేదో వుంది. జయంతి ఓ సారి లలిత ముఖం వంక చూసి నవ్వి, 'వన్ మినిట్' అని అతని దగ్గర కెళ్ళింది. కనీసం వాళ్ళిద్దరి సంభాషణా ముగియడానికి అయిదు నిమిషాలయింది. జయంతి తిరిగి లలిత దగ్గర కొచ్చింది.

'ఎవరు?' అంది లలిత.

'మా ఆఫీసులో కోక్లర్క్.' అంది జయంతి ముక్తసరిగా.

'ఎందుకు పిలిచినట్టు?' అంది లలిత.

'అదొక రోగం. అలా రోజూ పిలుస్తూనే వుంటాడు. బుద్ధి లేకపోతే సరి' అంది జయంతి కోపాన్ని అభినయించి.

లలిత నవ్వి 'అతనికి బుద్ధి వుంది జయంతీ! లేనిది నీకు' అనగానే జయంతి తెల్లబోయింది.

'అవును జయంతీ! అతను పిలిచాడే అనుకో! పిలిచిందే తడవుగా వెళ్ళడానికి నీకేం బుద్ధి లేకపోయిందీ అని.'

'సభ్యత కాదు గదా!' అంది జయంతి.

'అతను పిలవడం సభ్యతే నన్నమాట' ఇలాంటి పిచ్చి పనులు ఎప్పుడూ చేయకు' అంది లలిత.

జయంతి మౌనంగా వుండిపోయింది. బస్సు రావడంతో ఆ సంభాషణ అంతటితో ఆగిపోయింది. బస్సులో జయంతి మౌనంగా వుండిపోతే లలిత కలుగజేసికొని మాట్లాడింది. జయంతి దిగిపోతుందనగా—

'ఈ దిగులుతోనే ఆఫీసులో కూర్చో వద్దు. కాస్త నవ్వు' అంది.

జయంతి నవ్వి దిగిపోయింది.

లలిత ఆఫీసుకి వచ్చేసరికి యింకా అయిదు నిమిషాలు ఆలస్యమే అయింది. కంగారుపడుతూ ముందు ఆఫీసరుగార్కి కనిపించి వెళదామని స్ప్రింగ్ డోర్ తెరిచి

కనిపించిన దృశ్యాన్ని చూసి స్తబ్ధురాలయి వెంటనే గిరుక్కున వెనక్కు తిరిగి, తడబడుతూ తన సీట్లోకి వెళ్ళి కూర్చొంది. చేతి వ్రేళ్ళు వణుకుతున్నట్టు తోచి గట్టిగా బల్లమీద అదిమిపెట్టింది. ఆఫీసులో తోటి స్టాఫ్ అంతా తన దిగ్భ్రమను గుర్తించకుండా వుండగలందులకు విశ్వప్రయత్నం చేయసాగింది.

'ఏం! అలా వెనక్కు తిరిగి వెళ్ళిపోయారేం' అంది స్వరాజ్యం దగ్గరగా వచ్చి.

లలిత స్వరాజ్యం వంక చూడకుండానే ఫైళ్ళు సర్దటంలో నిమగ్నురాలయి—

'అబ్బే! ఏం లేదు' అంది.

'ఆఫీసరుగారు ఏదో చెబుతుంటే వినవలసి వచ్చింది.'

ఈసారి తల దించుకోవడం స్వరాజ్యం వంతయింది. త్రినేత్రుని కోపాగ్నిజ్వాలల్లా మండుతూన్న లలిత కళ్ళవంక చూసి, నోరెత్తకుండా తన సీట్లోకి వెళ్ళిపోయింది స్వరాజ్యం. ఆ రోజు ఒక్కసారి కూడా ఆఫీసరు దగ్గరినుండి లలితకు పిలుపు రాలేదు. అయిదుగంటలు కాగానే ఫైళ్ళన్నీ సర్ది పెట్టి ప్యూనుచేత కబురు పంపి మరీ లోనికివెళ్ళి, వెళుతున్నట్లు చెప్పి, ఇవతలికి వచ్చేసింది ఆఫీసులో వాళ్ళంతా తెల్లబోతుండగా.

జయంతితో కలసి వెళ్ళవచ్చునన్న ఉద్దేశ్యంతో దగ్గరే కనుక వాళ్ళ ఆఫీసువరకూ నడిచివచ్చింది. జయంతికోసం కనీసం అరగంటయినా వెయిట్ చెయ్యాల్సివచ్చింది.

'వెరీసారీ లల్లీ! అర్జంటు కాగితాలుండిపోయాయి. ఆలస్యం అయింది' అని 'నువ్వు కరెక్టుగా అయిదు గంటలుకాగానే వచ్చేసినట్టున్నావు. మీ ఆఫీసరెంత మంచివాడో' అంది.

లలిత ఏం జవాబు చెప్పలేదు. చాలా దూరం మౌనంగానే నడిచివచ్చింది. లలిత వింత ప్రవర్తనకు జయంతి ఆశ్చర్యపోతూ 'ఏం లల్లీ అలావున్నావ్' అంది.

లలిత చెప్పిన విషయం విని జయంతి దిగ్భ్రాంతురాలయి 'నిజంగానా' అంది.

నా కళ్ళతో నేను చూశాను జయంతీ! లేకపోతే అంత ధైర్యంగా నేనెలా చెప్పగలను' అంది.

'ఛీ! ఛీ!' అంది జయంతి.

ఏవరిదారినవారు విడిపోయేవరకూ యిదే చర్చకొనసాగింది.

'నేనింక ఈ వెధవ ఉద్యోగం చెయ్యను' అంది లలిత రాజారావుతో.

రాజారావు తెల్లబోయి 'ఏం లలితా' అన్నాడు.

'ఏంలేదు. నేను చెయ్యను. చెయ్యదలుచుకోలేదు. రేపే వెళ్ళి రాజీనామా వ్రాసేస్తాను.' అంది ఎంత ప్రయత్నించినా రాజారావు ఆమెనుండి నిజం రాబట్టలేకపోయాడు.

'హాయిగా తిని కూర్చోక వాకి పాడు బుద్ధిపుట్టింది' అని లెంపలేసుకుంది కూడా. మర్నాడు లలిత నోటినుండి విషయం విన్న జయంతి విస్మితురాలయి.

'ఏం లలితా! ఇంతమాత్రానికేనా' అంది.

'నువ్వు లక్షచెప్పు జయంతీ! హాయిగా నువ్వు చెప్పినట్లు ఇంట్లోపడివుండలేక ఏదో స్వతంత్రంగా బ్రతకాలనుకున్నందుకు మంచి గుణపాఠమే నేర్చుకున్నాను చాలు... చాలు' అంది.

'మరి నా మాట' అంది జయంతి ఖిన్నురాలయి.

'లక్షణంగా పెళ్ళిచేసుకుని వెంటనే గృహిణిగా మారిపో. నీమీద ఆధారపడ్డ వాళ్ళు ఉన్నారు గనుక ఎలాగూ నీకీబాధ తప్పదు.

'వివాహం చేసుకోనంతకాలం ఏదోరూపంలో అశాంతి తాలూకు ఛాయలు నిన్ను వెన్నాడుతూనే వుంటాయి. వివాహమంటే స్వేచ్ఛ నశించిపోతుందనీ, స్వతంత్రభావాలు అణగారిపోతాయనీ నిరుత్సాహం చెందకు. నీమనోభావాలకు అనుగుణ్యమైన వ్యక్తినే నీజీవిత భాగస్వామిగా ఎంచుకో! ఈ విషయంలో చప్పున ఓ నిర్ణయానికి రాగలనని నువ్వు నాకు ప్రామిస్‌చెయ్యాలి' అంది లలిత.

'ప్రామిస్' అంది జయంతి లలిత చేతిలో చెయ్యివేసి.

బయటకు రాబోతున్న రాజారావు, పగలబడి నవ్వుతూన్న ఇద్దరినీ చూసి తెల్లబోయాడు. ●

